క్లుప్తంగా

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ



కేశనపల్లిలో పాఠశాలకు ప్రింటర్ అందిస్తున్న సర్పంచ్ యెనుముల నాగు

మలికిపురం: కేశనపల్లి యెనుముల బ్రహ్మానందం జెడ్పీ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన అడబాల లక్ష్మీ నరసింహమూర్తి రూ.35 వేలు విలువైన డూప్లెక్స్ ప్రింటర్‌ను బహూకరించారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ యెనుముల నాగు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆనందం రాంబాబు చేతుల మీదుగా దీనిని అందించారు. ఈ సందర్భంగా దాతను అభినందించారు. ప్రధానోపాధ్యాయులు ఎస్.ఉమామహేశ్వరరావు గిడుగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దిండిలో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ అందిస్తున్న ఎంపీడీఓ వీరా స్వామినాయుడు

మలికిపురం: మండలంలోని దిండి చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ ముత్యం వీరాస్వామినాయుడు సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రంలో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ మజ్జిగ, తాగునీటి ప్రయాణికులకు అందుబాటులో ఉంటుందని అన్నారు. కార్యదర్శి ఇంజేటి శుభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.25 వేల విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు సోమవారం కొత్తపేటకు చెందిన మల్లంపల్లి శేషగిరి రూ.25,116 విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. విరాళం అందించిన దాతకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, స్వామి వారి దర్శనం కల్పించి, వేదాశీర్వచనం అందజేశారు. దాత కుటుంబానికి ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఈఓ గ్రంధి మాధవి పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

ఆలమూరు: మండలంలోని నవాబుపేటలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత జ్ఞాన ప్రచార కార్యక్రమం జరిగింది. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక రాజమహేంద్రవరం శాఖ అధ్యక్షుడు శేఖర్‌బాబు ఆధ్వర్యంలో భక్తబృంద సభ్యులు గ్రామంలో పర్యటించి ఈనెల తొమ్మిదిన జరిగే ఉగాది విశిష్టతను తెలియజేశారు. హిందుత్వంలోని సంప్రదాయాలను, వేమన భగవాన్ పద్యాల్లోని జ్ఞానాన్ని తెలియజేశారు. భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగ అధ్యాయంలోని 16,17 శ్లోకాల ఆధారంగా పరమాత్మ, ఆత్మ, జీవాత్మల విధానాన్ని వివరించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల బోధనలను ప్రజలకు వివరించారు. అనంతరం హిందూ మత గ్రంధాలను ప్రదర్శించి హిందూమతంలో ఉన్న గొప్పతనాన్ని, ప్రజలందరికీవివరించాలని భక్తులకు సూచించారు. త్రైత సిద్ధాంత ప్రతినిధులు వేణుమాధురి, శోభారాణి, సంధ్యారాణి, లక్ష్మీనారాయణ, బీఎస్ఎన్ మూర్తి, లోహిత, జోష్, జస్వంత్, విజయ్, భరత్, జైరాం, భరత్, జయ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంఘ సమావేశం

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిపాలెం సెంటర్‌లోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద సోమవారం మండల భవన నిర్మాణ కార్మికుల సంఘ సమావేశం నిర్వహించారు. సమావేశంలో తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా కార్డులను సంఘ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి భవన నిర్మాణ కార్మికుడు ప్రమాద బీమా కార్డు తప్పనిసరిగా చేయించుకోవాలని, ఏదైనా ప్రమాదం జరిగిన సందర్భంలో ప్రభుత్వం నుంచి సాయం పొందడానికి కార్డు తప్పనిసరి అన్నారు. అలాగే బీమా కార్డులను కూడా రెన్యువల్ చేయించుకోవాలని వెంకటేశ్వరరావు సూచించారు. సంఘ ఉపాధ్యక్షుడు గంటా శ్రీను, కార్యదర్శి సత్తిబాబు, మేళ్ల తులసీనాథ్, సంఘ పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

అంతర పంటలతో ఆదాయం భళా

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం
- దృష్టి పెట్టాలని వ్యవసాయాధికారుల సూచన



అంబాజీపేటలో కొబ్బరితోటలో అంతర పంటగా సాగు చేస్తున్న అరటి, పసుపు, అనాస, కోకో

అంబాజీపేట: అనాధిగా కోనసీమ రైతాంగం కొబ్బరి, వరి లాంటి సంప్రదాయ పంటలనే సాగు చేస్తున్నారు. అదే సమయంలో తమకు ఆదాయాన్ని తక్కువ సమయంలో అందించే అంతర పంటలపై దృష్టి సారించడం లేదు. రోజురోజుకి వ్యవసాయం కష్టతరం అవుతుండటం, నిర్వహణ వ్యయాలు పెరిగిపోవడంతో రైతుల దృష్టి ప్రత్యామ్నాయ పంటలపై మళ్లింది. దీనిలో భాగంగా శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు సూచించిన అంతర పంటలను సాగు చేస్తూ అధిక ఆదాయాన్ని పొందుతున్నారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో ఒకే సారి ఏడు అంతర పంటలను పండించి శాస్త్రవేత్తలు కృతకృత్యులయ్యారు. దీనిని ఆదర్శంగా తీసుకుని కొంత మంది అభ్యుదయ రైతులు తమ పొలాల్లో కొబ్బరి, అరటి, కోకో, కంద, అనాస, మిరియం, తమలపాకు, కూరగాయ పాదులు, పూలసాగు తదితర పంటలను సాగు చేస్తూ అంతర పంటల ద్వారా అధిక ఆదాయం సాధిస్తున్నారు. వాణిజ్య పంటల రైతులు మార్కెట్‌లో ఫల సాయం అందే సమయంలో ప్రకృతి వైపరీత్యాలతో పంటలను కోల్పోవటం, లేకపోతే గిట్టుబాటు ధర లభించక తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాలోని 180 ఎకరాల్లో అంతర పంటలు సాగు చేస్తున్నారు.

అంతర పంటలుగా ఎన్నో రకాలు..

కొబ్బరితోటల్లో వాణిజ్య పంటలైన అరటి, కోకో, పోక, కంద, పసుపు, బత్తాయి, కూరపాదులతో పాటు పూల సాగును అంతర పంటలుగా వేస్తున్నారు. వాణిజ్య పంటలు వేసిన నాటి నుంచి ఫలసాయం అందడానికి 9 నెలల నుంచి 11 నెలల సమయం పట్టడంతో రైతులు అప్పటి వరకు ఏదో విధంగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది.

> **రైతులకు ఎంతో మేలు**
>
> 
>
> అంతర పంటలతో భూములకు, రైతులకు ఎంతో మేలని వ్యవసాయాధికారులు తెలిపారు. ఈ పంట వల్ల పంటల్లో వచ్చే తెగుళ్ల వ్యాప్తి తక్కువగా ఉంటుందన్నారు. మేలు చేసే మిత్ర పురుగులు క్రిమి కీటకాలను ఆహారంగా తీసుకుంటాయి. అలాగే ఈ పంటల నుంచి వచ్చే పచ్చిరొట్టతో భూసారం పెరుగుతుంది. వాణిజ్య పంటలో ఏదో ఒకటి అంతర పంట వేస్తారు. కొబ్బరిలో కోకో, పోక, కూరపాదులు, బత్తాయి తదిత అంతర పంటగా వేస్తున్నారు. అంతర పంటలు సాగు చేయడం వల్ల లాభాలు ఆర్జిస్తున్నారు.
>
> – ఎం.దిలీప్‌కుమార్, ఉద్యాన అధికారి, అంబాజీపేట

భగవంతుడు మెచ్చేలా జీవించాలి

అయినవిల్లి: భగవంతుడు మెచ్చేటట్టు మానవులు జీవిస్తేనే వారి జీవితం సార్ధకం అవుతుందని నల్లచెరువులోని అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్ నిర్వాహకుడు, ప్రభుజీ సుందర శ్రీనివాసదాస్ అన్నారు. ఆదివారం నల్లచెరువులో శ్రీకృష్ణతత్వాన్ని శ్రీనివాసదాస్ బోధించారు. భగవద్గీతలోని 12 వ అధ్యాయాన్ని ఆయన వివరించారు. భగవంతుడు సూచించిన దారిలో ప్రయాణిస్తే ఆయన సంతోషిస్తాడన్నారు. ఆయన సేవలో తరించిన వారే ఆయనలో ఐక్యం అవుతారన్నారు. దేవాధిదేవుడు సేవ చేయడం కూడా పూర్వజన్మ సుకృతమే అన్నారు. అనంతరం భక్తులు స్వామి అన్నప్రసాదం స్వీకరించారు.

విధుల నుంచి వలంటీర్ తొలగింపు

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంక సచివాలయం -1లో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న సేనాపతి కరుణాకర్‌ను విధుల నుంచి తొలగించినట్టు ఎంపీడీవో పీవీ సత్యనారాయణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కరుణాకర్‌ను ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద ఆ పోస్టు నుంచి తొలగించినట్టు, వాట్సాప్ గ్రూపు నందు రాజకీయ పరమైన మెసేజ్‌లు పోస్ట్ చేసినట్టు గుర్తించామన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు

రాజోలు: వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఆ పార్టీ వైపు ఆకర్షితులయ్యామని రాజోలు నున్న వారి బాడవ బంగ్లా (ఉర్దూ పేట)కు చెందిన పలువురు యువకులు అన్నారు. సోమవారం తాటిపాకలోని మాజీ మంత్రి, రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు సమక్షంలో వారంతా టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ఉర్దూ పేటకు చెందిన నల్లి శ్రీనివాస్, బుడితి చిన్న పెద్దిరాజు, మోకా ఆనంద్, కందికట్ల శ్రీనివాస్, బుడితి నరసింహరావు, బుడితి వెంకట్(పెద్ద) తదితరులకు వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి గొల్లపల్లి ఆహ్వానించారు. గొల్లపల్లి మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాలకు రాజకీయంగా, ఆర్థికంగా భరోసా ఇచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా విజయపథంలో నిలపాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారన్నారు. రాజోలు గ్రామశాఖ అధ్యక్షుడు బొద్దపల్లి ప్రసాద్, బుంగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలోకి యువకులను ఆహ్వానిస్తున్న గొల్లపల్లి

ఏజీపీని కలసిన మాజీ మంత్రి గొల్లపల్లి

రాజోలు: రాజోలు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ) యర్రంశెట్టి అయ్యప్పనాయుడిని మాజీ మంత్రి, రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గొల్లపల్లి న్యాయవాది కావడంతో అయ్యప్పనాయుడు ఆయనకు స్వయంగా నల్ల కోటును ధరింపజేసి ఆహ్వానం పలికారు. గతంలో అమలాపురం, రాజోలు కోర్టుల్లో న్యాయవాద వృత్తిలో తారసపడిని అనుభవాలను గుర్తు చేసుకున్నారు. రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి అయిన గొల్లపల్లిని విజయపథంలో నిలిపేందుకు కృషి చేస్తామని అయ్యయప్పనాయుడు తెలిపారు. రాజోలు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చింతా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గొల్లపల్లికి ఆహ్వానం పలుకుతున్న ఏజీపీ అయ్యప్పనాయుడు

మళ్లీ జగన్‌ను సీఎంగా గెలిపించాలి

ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి

పి.గన్నవరం: పేదలకు, పెత్తందార్ల మధకచ ఈఎన్నికలు జరుగుతున్నాయని, పేద ప్రజలకు న్యాయం జరగాలంటే మళ్లీ సీఎంగా జగన్‌ను గెలిపించాలని పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు, నియోజకవర్గ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నరేంద్రపురం, కుందాలపల్లి, రాజులపాలెం గ్రామాల్లో విప్పర్తి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ప్రజలను కలుసుకున్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి తమను గెలిపించాలని అభ్యర్థించారు. వారు మాట్లాడుతూ జగన్ పాలనలో అమలైన ప్రజా సంక్షేమ పథకాలను వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. జగన్ పాలనలో పేదలు లక్షాధికారులు అయ్యారని వివరించారు. పలు చోట్ల మహిళలు విప్పర్తికి హారతులిచ్చారు. ముస్లిం మత గురువులు ప్రార్థనలు చేశారు. కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, నేలపూడి స్టాలిన్‌బాబు, కొంబత్తుల ఏసుబాబు, మెల్లం మహాలక్ష్మి ప్రసాద్, నక్కా గోపి, గుత్తుల మధు, సాధనాల రమేష్, పప్పుల రాంబాబు, పినిశెట్టి శ్రీనివాస్, పప్పుల కర్ణ తదితరులు పాల్గొన్నారు.



నరేంద్రపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి

చిర్ల ప్రచారంలో ఓటర్ల ఉత్సాహం

జగ్గిరెడ్డి ప్రచార వాహనాల వద్ద గుమిగూడుతున్న రైతులు, రైతు కూలీలు

కొత్తపేట: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, నియోజకవర్గంలో ఆ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి మళ్లీ గెలవాలి.. అంటూ ఎక్కడికక్కడ ప్రజలు ముక్తకంఠంతో మద్దతు పలుకుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు మండలాల్లో జగ్గిరెడ్డి ప్రచార రథాలు దూసుకుపోతున్నాయి. జగన్ నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు గ్రామాల్లో ప్రజల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తుంది. ప్రస్తుతం అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల తరుణంలో వైఎస్సార్ సీపీ ప్రచార రథాలు, వాహనాలు గ్రామాల్లో ప్రచారం చేస్తున్న వేళ జనం వాటి వద్ద గుమిగూడుతున్నారు. పొలాల్లో పనిచేసుకుంటున్న రైతులు, రైతు కూలీలు, ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న ఉపాధి కూలీలు ముఖ్యంగా మహిళలు రోడ్డెక్కి ఆ ప్రచార రథాలు, వాహనాల వద్ద గుమిగూడుతున్నారు. జగన్, జగ్గిరెడ్డిలకే మా మద్దతు అంటూ నినదిస్తున్నారు. మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలని తాము కోరుకుంటున్నామని ముక్తకంఠంతో నినదిస్తున్నారు.



గుమ్మిలేరులో చిర్ల ప్రచార వాహనం వద్ద ఉపాధి కూలీల మద్దతు

బీసీల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తా



రామేశ్వరంలో నిర్వహించిన బీసీ ఐక్యత సమావేశంలో గొల్లపల్లి, బీసీ నాయకులు

సఖినేటిపల్లి: రానున్న రోజుల్లో బీసీల సమగ్రాభివృద్ధికి తగిన కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. సోమవారం రామేశ్వరంలో జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ పాటి శివకుమార్ ఇంటి వద్ద ఆయన అధ్యక్షతన బీసీ ఐక్యత సమావేశం నిర్వహించారు. సమావేశంలో గొల్లపల్లి ముఖ్య అతిథిగా మాట్లాడారు. బీసీల పార్టీగా చెప్పుకునే టీడీపీ బీసీలను దగా చేసిందని దుయ్యబట్టారు. అలాగే ఎన్నికల సమయాల్లో వారిని ఓటు బ్యాంక్‌గా టీడీపీ చూసిందని, అయితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో బీసీలకు మహర్దశ పట్టిందన్నారు. బీసీలను రాజ్యసభకు పంపిన ఘనత కూగా సీఎం జగన్‌కే దక్కిందన్నారు. ఒక వైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధితో పాటు సామాజిక న్యాయం చేసిన సీఎం జగన్‌ను ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని గొల్లపల్లి కోరారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, మహిళా అధ్యక్షురాలు మొల్లేటి మహేశ్వరి, మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, చేనేత నాయకుడు జాన శంకరరావు, సర్పంచ్ కట్టా ఉమామహేశ్వరరావు, నాయకులు దొంగ నాగ సత్యనారాయణ, బళ్ల లక్ష్మణ్, ఒడుగు వెంకట్, కారుపర్తి భాస్కరరావు, చింతా సుధాకర్‌రావు, పలువురు బీసీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉమ్మడి పొత్తులోను దండోరాకు అన్యాయం

అంబాజీపేట: ఉమ్మడి కూటమిలోనూ బీజేపీ పార్టీ దండోరా నాయకులకు తీవ్ర అన్యాయం చేసిందని దండోరా నాయకులు విమర్శించారు. పుల్లేటికుర్రులో సీనియర్ బీజేపీ నాయకులు కొల్లి సూర్యారావు స్వగృహం వద్ద నియోజకవర్గ దండోరా సన్నిహితులతో ఆత్మియ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి పొత్తులో పి.గన్నవరం నియోజకవర్గంలో దండోరా సామాజిక వర్గానికి చెందిన నాయకుడు గెలిచే అవకాశాలు ఉన్నా సీటు కేటాయించకుండా అవమానపరిచారన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో జనసేనకు సీటు కేటాయించి బీజేపీ మాదిగలకు అన్యాయం చేసిందన్నారు. జిల్లాలో మాదిగల రాజకీయ భవిష్యత్ శూన్యంగా మారిందని, ఎన్నికల తర్వాత ఉమ్మడి పార్టీలు తమను పట్టించుకునే దాఖలాలు లేవన్నారు. త్వరలో సీనియర్ దండోరా నాయకులతో చర్చించి రాజకీయ భవిష్యత్ కోసం కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు బొమ్మి బాలరాజు, తొత్తరమూడి గోవింద్, చింతపర్తి భీమన్న, లూటుకుర్తి సత్యనారాయణ, కొడమంచలి రమణ, నేదునూరి సత్యనారాయణ, కొల్లి గంగాధర్ పాల్గొన్నారు.



పుల్లేటికుర్రు సమావేశంలో పాల్గొన్న దండోరా నాయకులు

భారత్‌ను మోదీ విశ్వగురుగా నిలిపారు



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న పార్టీ ఉపాధ్యక్షుడు వేమా

మామిడికుదురు: ప్రధాని నరేంద్రమోడీ భారత్‌ను విశ్వగురు స్థానంలో నిలిపారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. గెద్దాడలో సోమవారం జరిగిన సమావేశంలో పలువురు పార్టీలో చేరారని మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ తెలిపారు. పార్టీలో చేరిన వారికి వేమా బీజేపీ కండువాలు కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. శత్రు దేశాలైన పాకిస్థాన్, చైనా దేశాల ప్రజలు మోదీ వంటి సమర్థుడైన నాయకుడు కావాలని కోరుకుంటున్నారన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు అడబాల రాంబాబు, సత్యనారాయణ, కంకిపాటి సుబ్బారావు, మాలే శ్రీనివాసనగేష్, చెంపాటి శివ రామకృష్ణ, అచ్యుత రామరాజు, అడపా వెంకటరత్నం, నక్కా త్రిలోచనరావు, సీహెచ్ త్రినాథ్, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

మామిడికుదురు: పెదపట్నంలంక దేవి సెంటర్‌లో కోదండరామస్వామి వారి పాల శిలా విగ్రహ ప్రతిష్ఠ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ముత్యాల వీవీలక్ష్మీసత్యనారాయణ-శ్రీదేవి, ముత్యాల అమ్మిరాజు-కుమారి, ముత్యాల దుర్గా ప్రసాద్-ఉషాదేవి దంపతులు కర్తలుగా కూర్చుని పలు పూజలు చేశారు. దీనిలో భాగంగా విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, చతుర్వేద స్వస్తి, తదితర పూజలను వైభవంగా జరిపించారు. 3వ తేదీ వరకు ఈ పూజలు జరిగాయి.

ఆలయ వార్షికోత్సవం

అమలాపురం రూరల్: మండలంలోని ఎ.వేమవరం గ్రామ దేవత బూరుగులమ్మ ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయ 8వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమలాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ నల్లా విష్ణుమూర్తి, లింగోలు పండు తదితరులు అమ్మవారికి పూజలు చేశారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా

ఆలమూరు: పేదల పట్ల ప్రతిపక్ష పార్టీలు అవలంబిస్తున్న నిరంకుశ వైఖరి, ఎన్నికల కమిషన్ తీసుకున్న అసందర్భ నిర్ణయాలను నిరసిస్తూ మండలంలోని చెముడులంక గ్రామ సచివాలయ పరిధిలోని వలంటీర్లు సోమవారం మూకుమ్మడి రాజీనామా చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు ఒకటో తేదీ తెల్లవారుజామునే పింఛన్లు ఇస్తున్న తమను అనాలోచితంగా టీడీపీ అధినేత చంద్రబాబు తన మందిమాగధులతో కోర్టులో పిటిషన్ వేయించి గ్రామ వలంటీర్లను ప్రజలకు దూరం చేశారన్నారు. దేశ వ్యాప్తంగా గ్రామ వలంటీర్ వ్యవస్థపై ప్రశంసలు లభిస్తుంటే రాష్ట్రంలో మాత్రం బురద జల్లుతున్నారని దుయ్యబట్టారు. అందుకే గ్రామంలోని రెండు సచివాలయాల పరిధిలోని 28 మంది మూకుమ్మడి రాజీనామా చేశామన్నారు. ఈ మేరకు రాజీనామా ప్రతులను పంచాయతీ కార్యదర్శి యు.రేణుకకు అందజేశారు.



చెముడులంకలో రాజీనామా సందర్భంగా విలేకరులతో మాట్లాడుతున్న గ్రామ వలంటీర్లు

పని చేసేవారికి ఎల్లవేళలా గుర్తింపు

అంబాజీపేట: విధి నిర్వహణలో ప్రజల మధ్యే ఉంటూ వారికోసం పని చేసేవారికి ఎల్లవేళలా గుర్తింపు ఉంటుందని తహసీల్దార్ జె.విమలకుమారి అన్నారు. గంగలకుర్రు వీఆర్వోగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందుతున్న వక్కలంక నాగేశ్వరరావు సన్మాన సభను అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించే వారు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. అనంతరం నాగేశ్వరరావు, నాగమణి దంపతులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పి.నాగపద్మ, ఆర్ఐ ఎండీ ఇబ్రహీం, వీఆర్వోలు, వీఆర్ఏలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.



వీఆర్వో నాగేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న తహసీల్దార్ విమలకుమారి

వైఎస్సార్ సీపీలో 25 కుటుంబాల చేరిక



నరేంద్రపురం శివారు పోలంపేటలో పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేస్తున్న విప్పర్తి వేణుగోపాలరావు

పి.గన్నవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో వైఎస్సార్ సీపీకి వాడవాడలా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఆ పార్టీ పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని నరేంద్రపురం శివారు పోలంపేటలో టీడీపీకి చెందిన 25 కుటుంబాలవారు విప్పర్తి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన కోట బాబూ రాజేంద్ర ప్రసాద్, నక్కా పల్లంరాజు, బొంతు సత్యనారాయణ, కోట భరతుడు, కత్తుల కిరణ్ తదితరులకు విప్పర్తి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా నక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ పాలనను మెచ్చుకుని ఇతర పార్టీల వారు పెద్దఎత్తున వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని అన్నారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మెల్లం మహాలక్ష్మి ప్రసాద్, స్థానిక నాయకులు జల్లి శ్రీను, కోట నాగేంద్రప్రసాద్, రాయుడు చిన్న, నేలపూడి సత్యనారాయణ, గుత్తుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదలపై కక్ష కట్టిన చంద్రబాబు

అంబాజీపేట: అవ్వాతాతలకు సకాలంలో పింఛన్లు అందకుండా చంద్రబాబు అడ్డదారిలో అడ్డుకుని అన్యాయం చేశారని పెదలకు పింఛన్లు సకాలంలో అందకుండా కక్ష కట్టి తీరని ద్రోహం చేశారని వైఎస్సార్ సీసీ నియోజకవర్గ అబ్జర్వర్ చెల్లిబోయిన శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు విమర్శించారు. అంబాజీపేటలో సోమవారం వారు మాట్లాడుతూ అవ్వాతాతలు, వితంతువులు, వికలాంగులకు దేశంలోనే ఎక్కడలేని విధంగా రూ.3 వేలు పింఛన్ అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి నెలా 1వ తేదీనే పింఛన్ అందిస్తున్న వలంటీర్లను విధుల నుంచి ఎన్నికల కమిషన్ తప్పించడం చంద్రబాబు కుట్రేనన్నారు. టీడీపీ, వైఎస్సార్ సీపీ అనే తేడా లేకుండా అర్హులందరికీ వలంటీర్లు అందిస్తున్నారన్నారు. వలంటీర్లలో 70 శాతానికి పైగా మహిళలే ఉన్నారని, వారిని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఈ నిర్ణయంతో అవ్వాతాతలు మరోసారి మండుటెండలో పింఛన్ల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు.



అంబాజీపేటలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు, స్టాలిన్‌బాబు